క్లుప్తంగా...

నేడు స్వచ్ఛ సర్వేక్షణ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్–2023 స్వచ్ఛతా లీగ్ 2.0లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శరత్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పీరంచెరువు కట్ట వద్ద 150 మంది విద్యార్థులకు, బెనిఫిక్ బండ్లగూడ జాగీరు(టీమ్) కెప్టెన్ మేయర్ మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పాగింగ్ యాక్టివిటీ, ర్యాలీ, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అధికారులతో మేయర్ సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పలు అభివృద్ధి పనులపై శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌లో జరుగుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. అధికారులు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిఈ యాదయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవరాత్రులను జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ శివకుమార్

మణికొండ: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తి భావంతో జరుపుకోవాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన నార్సింగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై వినాయక మండపాలను ఏర్పాటు చేయవద్దని, ఎక్కువ శబ్దం వచ్చేలా డీజేలను ఏర్పాటు చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, కౌన్సిలర్‌లు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారమే లక్ష్యం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్‌లోని కొత్తగూడ, గుల్షన్‌నగర్, గోపాల్‌రెడ్డినగర్‌లలో రూ. 80 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... దశలవారీగా శేరిలింగంపల్లిలోని అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి ఈ సమస్య తీసుకరాగా వారి ప్రత్యేక చొరవతో అదనంగా నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అదనంగా ఒక కిలోమీటరు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ పనులు మంజూరు చేశామన్నారు. శేరిలింగంపల్లిలో అత్యవసరమున్న చోట నిత్యం పొంగుతున్న ప్రాంతంలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శేరిలింగంపల్లిలో చేపట్టే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ పనుల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్ పనులతోపాటు నాలాల విస్తరణ, వరద నీటి కాలువల నిర్మాణ పనులను చేపట్టామని, వాటన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. జలమండలి డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్లు యాదయ్య, సందీప్, మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, నాయకులు, వార్డు, ఏరియా మాజీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష



పరీక్ష రాసేందుకు కేంద్రంలోని వెళ్తున్న అభ్యర్థి

మైలార్‌దేవ్‌పల్లి: ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో మొతకతం 6383 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అత్తాపూర్‌లో ఆరు కేంద్రాలు, మైలార్‌దేవ్‌పల్లిలో మూడు కేంద్రాలు, నార్సింగిలో ఐదు కేంద్రాలు, రాజేంద్రనగర్‌లో తొమ్మిది, శంషాబాద్‌లో ఐదు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకున్నారు. తమ హాల్ టికెట్ నెంబర్లను చూసుకోని పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండవ పేపర్ పరీక్షలు



పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నెంబర్ చూసుకుంటున్న అభ్యర్థి

కొనసాగాయి. అభ్యర్థులను క్షుణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోని పంపించారు. ఎగ్జామ్స్ సెంటర్ల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు పోలీసులకు సహకరిస్తూ పండుగలను నిర్వహించుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు వెల్లడించారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లిలోని గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గణేష్ నవరాత్రి సందర్భంగా మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు రాములు, కృష్ణయ్య, మండపాల నిర్వహకులు, ప్రజలు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు, పోలీసులు

ఘనంగా మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

మైలార్‌దేవ్‌పల్లి: అఖిల భారత మహిళా కాంగ్రెస్ 40వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉడ్డెంగడ్డలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అబ్బెశి సదాలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సౌజన్య, నిర్మల, ప్రభావతి, కవిత, ప్రేమిళ, ఉమ తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు

మిల్లెట్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం



నూతనంగా ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెసింగ్ సెంటర్



మిల్లెట్స్‌తో తయారు చేసిన పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మిల్లెట్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో నూతనంగా నిర్మాణం చేసిన కామన్ ఇంక్యుబెషన్ సెంటర్ ఫర్ మిల్లెట్స్‌ను శుక్రవారం ఆ శాఖ ఆదనపు కార్యదర్శి మిన్హాజ్ ఆలమ్ (ఐఎఎస్) పారంబించారు. నూతనంగా ఏర్పాటుచేసిన ఇంక్యూబేషన్ సెంటర్‌లోని వివిధ యంత్రాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంటర్‌ప్రెన్యూర్స్‌తో ముఖాముఖి చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి విశ్వవిద్యాలయం ఇంచార్జి ఉపకులపతి ఎం రఘునందన్ రావు,రిజిస్ట్రార్ ఎం వెంకరమణ పాల్గొన్నారు.



సీబీఐటీలో ఇంజనీర్స్ డే

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జాతీయ ఇంజనీర్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ డాక్టర్ పి.రామరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మన దేశానికే కాకుండా తన సేవలను ప్రపంచానికి సైతం అందించారన్నారు. ఆయన ప్రపంచ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, సివిల్ విభాగం అధిపతి జగన్నాధరావు పాల్గొన్నారు.

నాల్గో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: ఎస్సీ వర్గీకరణ సాధనకు పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రిలే నిరాహార దీక్షలు నాల్గవ రోజుకు చేరాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరాతి అరుణ్‌కుమార్‌మాదిగ ఆధ్వర్యంలో ఈ దీక్షలు నిర్వహిస్తున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సీనియర్ నాయకులు యాదయ్యమాదిగ, జిల్లా నాయకులు పుట్లగారి గణేష్‌మాదిగ, గోల్కొండ యాదయ్యమాదిగ, కోర ని శ్రావణ్‌మాదిగ, కోరలి కిషన్‌మాదిగ, కోరని కుమార్, కె.కాశయ్య, లింగం కృష్ణమాదిగలు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. దీక్షకు రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోరని బాలరాజు, రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్ కోరని దవానందం, టీడీపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కన్వీనర్ సోమారం రాజ్‌కుమార్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బిహార్ హస్తకళా ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం నుంచి ఉపేంద్ర మహారథి శిల్ప అనుసంధాన్ సంస్థాన్, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పది రోజుల పాటు బీహార్ చేనేత హస్తకళా ఉత్పత్తుల మేళాను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేళా 16 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి రోజు సాయంత్రం ఆంపి థియేటర్‌లో 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. బీహార్ రాష్ట్రం నుంచి 110 మంది చేనేత హస్తకళాకారులతో పాటు మధుబని పేయింటింగ్ చీరలు, ఖాదీ షర్టులు, జూట్ ఉత్పత్తులు, స్టోన్ కార్వింగ్, హ్యాండ్‌లూమ్ చీరలు, పెయింటింగ్ చీరలు ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ ఇజ్జత్‌నగర్‌లో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్తో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... పలు కాలనీలలో ప్రజల నుంచి వినతుల మేరకు డ్రైనేజీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌కి కిలో మీటరు చొప్పున భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు మంజూరు అయ్యాయన్నారు. జలమండలి డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయాలి

హఫీజ్‌పేట్: తుక్కుగూడలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలో ఈ నెల 17న జరగబోయే కాంగ్రెస్ విజయభేరి సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావు పిలుపునిచ్చారు. దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా గాంధీకి, భారత్ జోడో యాత్రతో దేశాన్ని ఏకం చేసిన రాహుల్ గాంధీలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి ప్రజలు విజయభేరి సభకు తరలివచ్చి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలన్నారు. నియోజవకర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు.

పుస్తకాలతో ప్రేరణ

రాయదుర్గం: పుస్తకాలు ప్రేరణకు మూలాలు, నెట్‌వర్కింగ్‌కు చిహ్నాలు అని వైశ్య బిజినెస్ నెట్ వర్క్ వ్యవస్థాపకులు శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీ కోహినూర్ లో 'ఎందరో మహానుభావులు–కొందరి పరిచయాలు' పేరిట ప్రత్యేకంగా రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఎందరో మహానుభావులు–కొందరి పరిచయం' పేరుతో రూపొందించిన పుస్తకంలో 51 వ్యాపార కుటుంబాలు సాధించిన విజయాలు, ఇతర వారికి సంబంధించిన అంశాలను పొందపర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైశ్యనెట్ వర్క్ ప్రతినిదులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మరిన్ని భాషలు నేర్చుకోవాలి

రాయదుర్గం: ప్రతి విద్యార్థి మరిన్ని భాషలు నేర్చుకోవాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ దివస్ సందర్భంగా విద్య, శిక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాతృభాష కాకుండా మరిన్ని ఇతర భాషలను నేర్చుకోవడానికి విద్యార్థులంతా ఆసక్తి కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. హిందీని అధికార భాషగా అమలు చేయడంలో విశ్వవిద్యాలయం కృసి, విజయాలను ప్రస్తావిస్తూ ఇటీవల పార్లమెంటరీ కమిటీ పర్యటనను ఆయన గుర్తు చేసుకున్నారు. హిందీ భాషలో కూడా 'మనూ' పరిపాలనా పనిని చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. అధ్యక్షత వహించిన స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం –2020లో మాతృభాషకు కల్పించిన ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ అశ్విని రచించిన 'సమావేశి శిక్షా కే వివిద్ ఆయామ్' అనే పుస్తకాన్ని ఆవిస్కరించారు. అనంతరం 'డిజిటల్ యుగంలో హిందీ భవిష్యత్తు' అనే అంశంపై ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, ప్రొఫెసర్ కరణ్‌సింగ్ ఉత్వాల్, ఓఎస్‌డీ–2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, విద్యా, శిక్షణ విభాగం అధిపతి ప్రొఫెసర్ షహీన్ అల్తాఫ్‌షేక్,డాక్టర్ షగుఫ్తా పర్వీన్, డాక్టర్ అశ్విని, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జహంగీర్ ఆలమ్, డాక్టర్ వీఎస్ సుమీ, డాక్టర్ ఫర్దొస్‌తబస్సుమ్, డాక్టర్ రుబీనా, డాక్టర్ షేక్ ఎహ్తేషాముద్దీన్, హిందీ ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు. పలు రకాల పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

'ఎస్కీ' మరిన్ని కోర్సులు ప్రారంభించాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

రాయదుర్గం: భౌతిక, మానవ వనరులను దృష్టిలో పెట్టుకొని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా మరిన్ని నూతన కోర్సులను ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా 56వ ఇంజనీర్ల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి సందర్భంగా క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ముందున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, టెక్నో మేనేజ్‌మెంట్ డొమైన్‌లకు నాణ్యమైన శిక్షణ, విద్యను అందించడంలో 'ఎస్కీ' చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ... దృఢమైన భవిష్యత్తును విద్యార్థులకు నిర్మించడంలో ఎస్కీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఏఅండ్‌పీ చీఫ్ ఎస్.లక్ష్మీకాంతరావు, పవర్, ఎనర్జీ సలహాదారు చంద్రమోహన్‌రావు, ఎస్కీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో రాజేంద్రనగర్ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, గణేష్ ఉత్సవాల నిర్వహణపై డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, సర్కిల్ ఉపకమీషనర్ రవికిరణ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. గణేష్ మండపాల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చనజయప్రకాష్, సంగీతగౌరీశంకర్, రాజేంద్రనగర్ సర్కిల్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

రెండు విడతల్లో వెయ్యి మందికి 'డబుల్' ఇళ్లు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు రెండు విడతల్లో 1000 మందిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారని ఆయన తెలిపారు. మొదటి విడతలో 500 మందిని ఎంపిక చేసి ఫ్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. వికలాంగులకు 24, ఎస్సీలకు 83, ఎస్టీలకు 29, ఇతరులకు 364 కేటాయించారన్నారు. రెండో విడత లబ్ధిదారులకు ఈ నెల 21న ఇళ్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.



లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు హాజరైన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓట్లు అడిగే హక్కు లేదు

రాజేంద్రనగర్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ సమాజాన్ని ఓట్లు అడిగే హక్కు లేదని, తెలంగాణలో విద్యా రంగంలో తీరని అన్యాయం జరుగుతుందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రంగారెడ్డి జిల్లా జనరల్ బాడీ సమావేశం రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవారాజ్ భవన్‌లో ఆకాష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను యూనివర్సిటీలను తుంగలో తొక్కి సమాజ సేవ చేయాల్సిన నాయకులే ప్రైవేటు యూనివర్సిటీలకు స్వాగతం పలుకుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకి పాలకులే విద్యను అందకుండా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గ్యార క్రాంతి, వినోద్, అజయ్, చందు, తేజ్, మల్లేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్

గంజాయి విక్రయించేందుకు యత్నం

ముగ్గురి అరెస్ట్





నిందితులు సబావత్ శివ | వెంకటేష్ | పవన్ కల్యాణ్

శంషాబాద్ రూరల్: గంజాయి విక్రయానికి యత్నిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం పడమటితండాకు చెందిన సభావత్ శివ(20) వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 14న మండలంలోని పెద్దషాపూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో గంజాయి విక్రయించేందుకు యత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 250 గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతన్ని శనివారం కోర్టులో హాజరుపర్చారు.

మరో ఘటనలో..

చిన్నగోల్కొండకు చెందిన పెయింటర్ పవన్‌కళ్యాణ్(26), గోరె వెంకటేష్(28) కలిసి శ నివారం గ్రామ శివారులోని ఇంద్రారెడ్డి కాలనీ సమీపంలో గంజాయి కల్గి ఉన్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని తనిఖీ చేయగా.. 350 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయితో పాటు స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శంషాబాద్ రూరల్: పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రెండు ఆటోల్లో తరలిస్తున్న 950 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి శివారులో శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హమీదుల్లానగర్ వైపు నుంచి శంషాబాద్ వెళ్తున్న రెండు ఆటో ట్రాలీలను తనిఖీ చేశారు. అందులో రేషన్ బియ్యం కనిపించడంతో పోలీసులు బియ్యంతో పాటు ట్రాలీను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. శంషాబాద్ పట్టణానికి చెందిన దుగుల్‌గుండి అర్బాజ్ అలీ, ఎలియాస్ అలీగా గుర్తించారు. వీరు ఆయా గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి శంషాబాద్, హైదరాబాద్‌లోని వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పని భారం భరించలేకే ఆశావర్కర్ మృతి



బండ్లగూడ: పని భారం భరించలేక ఆశావర్కర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిదని దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వం భరించాలని గండిపేట మండలం నాయకుడు డప్పు ప్రవీణ్‌కుమార్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆశావర్కర్ జ్యోతి వర్క్ లోడ్ ఎక్కువ కావడంతో టెన్షన్‌తో హై బీపీ, షుగర్ వల్ల రెండు రోజులు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్ల పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యాం, ఫిక్స్డ్ వేతనం లేకుండా వారితో రకరకాలైన పనులు చేయిస్తూ కొత్త కొత్త యాప్‌లలో వర్క్ భారం ఎక్కువ చేస్తుందన్నారు. ఆశావర్కర్ జ్యోతి కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు లత, శ్రీదేవి, శంకరమ్మ, జ్యోతి, స్వప్న, నాగలక్ష్మి తదితరులున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అత్తాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అత్తాపూర్ ఎస్సై నాగరాజు తెలిపిన మేరకు.. శుక్రవారం తెల్లవారుజామున పిల్లర్ నెంబర్ 293 వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో తలకు తీవ్ర గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అత్యాచారం కేసులో నిందితులకు జైలు

అత్తాపూర్: స్పెషల్ పోక్సో కోర్టు రాజేంద్రనగర్ అత్యాచార కేసుల్లో ఒకరికి జీవిత ఖైదీ విధించగా మరొకరికి పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు 20వేల రూపాయల జరిమానాను విధించారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపిన మేరకు.. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన బి.సత్యనారాయణ ఓ మైనర్ బాలికపై 2021లో లైంగికదాడి చేసిన కేసులో శుక్రవారం జీవిత ఖైదీతో పాటు 18 వేల జరిమానా విధించడం జరిగింది. 2015 సంవత్సరంలో ఓ మైనర్ బాలికపై లైంగికదాడి చేసిన సర్దార్ చందాసింగ్‌కు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 20 వేల జరిమానా విధించారు. ఈ మేరకు ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించిన అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు.



ఆసుపత్రిలో నిందితుడు సర్దార్ చందాసింగ్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230